ప్రజాశక్తి

గురువారం 13 ఏప్రిల్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

అక్టోబర్‌లో 'వెలిగొండ'ను ప్రారంభిస్తాం..

- ఈ ప్రాజెక్టును చంద్రబాబు పూర్తిగా వదిలేశారు..
- సెల్ఫీ ఛాలెంజ్‌కు సిద్ధమా?
- డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అంటూ మోసం చేసింది ఆయన కాదా?
- వైఎస్‌ఆర్ ఇబిసి నేస్తం ప్రారంభోత్సవంలో సిఎం జగన్

ప్రజాశక్తి-మార్కాపురం

'పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' ఈ ప్రాంత రైతన్నల కల అని, దీన్ని వచ్చే అక్టోబరులో ప్రారంభిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మొదటి సొరంగాన్ని పూర్తి చేశామని, రెండో సొరంగం 1.8 కిలోమీటర్లు మాత్రమే తవ్వాల్సి ఉందన్నారు. రెండో సొరంగం పనులు సెప్టెంబర్‌లో పూర్తవుతాయని, అక్టోబర్‌లో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తానని సిఎం జగన్ స్పష్టం చేశారు.

అగ్రవర్ణ పేద మహిళల ఆర్థికాభివృద్ధి కోసం చేపట్టిన 'వైఎస్‌ఆర్ ఇబిసి నేస్తం' రెండవ విడత ప్రారంభోత్సవంలో భాగంగా మార్కాపురం పట్టణంలోని ఎస్‌వికెపి కళాశాల మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టులో మిగిలిపోయిన పనులన్నీ 5 లేదా 6 నెలల్లో పూర్తవుతాయన్నారు. కీర్తిశేషులు సిఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రెండు సొరంగాలకు సంబంధించిన 36 కిలో మీటర్ల దూరానికి గానూ 20 కిలోమీటర్ల మేర రెండు సొరంగాల పనులు పూర్తి చేయగలిగారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సొరంగ మార్గాన్ని పూర్తి చేయగలిగామన్నారు. ఈ ప్రాజెక్టును చంద్రబాబునాయుడు పూర్తిగా వదిలేశారన్నారు. ఆయన సిఎంగా ఉన్న కాలంలో కేవలం ఐదు కిలోమీటర్ల దూరం వరకు మాత్రమే సొరంగ మార్గాలను తవ్వగలిగారన్నారు. తాము మాత్రం వెలిగొండను పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

సెల్ఫీ ఛాలెంజ్‌కు సిద్ధమా..?

మాజీ సిఎం చంద్రబాబు ఇటీవల సెల్ఫీలను ఫేక్ సెల్ఫీలుగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివర్ణించారు. టిడిపి హయాంలో పూర్తి చేయని టిడ్కో గృహాల వద్ద సెల్ఫీలు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. అక్కడ సెల్ఫీలు దిగడం కాదు... ప్రతి ఇంటికీ వెళ్లాలని, ఆ ఇంటికి ఏమి లబ్ధి చేకూర్చావో సెల్ఫీ దిగాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్దామని... మీరు ఏమి చేశారో చెప్పాలి... మేం ఏమి చేశామో చెబుతామని, ఈ విధంగా ఎవరు ఎంత మేలు చేశారో చెప్పే సెల్ఫీ ఛాలెంజ్‌కు ముసలాయన సిద్ధమా? అంటూ చంద్రబాబుకు సవాల్ విసిరారు. చంద్రబాబు గత ఎన్నికల్లో 600 హామీలతో మ్యానిఫెస్టో తయారు చేశారన్నారు. అందులో ఏ ఒక్కటీ సరిగ్గా అమలు చేయలేదన్నారు. ఆ మ్యానిఫెస్టో వెబ్‌సైట్‌లో నుంచి కూడా ▶ 2లో



ఇబిసి నేస్తం చెక్కు అందజేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

నిర్వాసితులను ఆదుకోవాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో సిపిఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. మార్కాపురం ప్రాంతంలో నిర్మితమవుతున్న వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని, నిర్వాసితులను ఆదుకోవాలని, మార్కాపురం ప్రత్యేక జిల్లాగా గుర్తించాలని కోరుతూ నినదించారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక కాలేజి రోడ్డులోని లూథరన్ చర్చి వద్దకు రాగానే సిపిఎం నేతలు మార్కాపురం జిల్లా జెండాలతో ఆందోళనకు దిగారు. ఆ సమయంలో సిఎం జగన్ కూడా కాన్వాయ్‌లో నుంచి చూశారు. కానీ స్పందించలేదు. దీంతో సిపిఎం నేతలు నిరసన తెలిపారు. ప్రజల ఆకాంక్ష, అవసరాలను గుర్తించకపోవడం దారుణమని సిపిఎం పట్టణ కార్యదర్శి డి సోమయ్య అన్నారు. నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో పోలీసులకు, సిపిఎం నాయకుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఆందోళనలో సిపిఎం నాయకులు డికెఎం రఫి, పి.రూబెన్, షేక్ నన్నెషా, జవ్వాజి రాజు, ఏనుగుల సురేష్‌కుమార్, విజయ్‌కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రకాశం జాయింట్ కలెక్టర్‌గా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రకాశం జిల్లా సంయుక్త కలెక్టర్‌గా డాక్టర్ కె.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు, తహశీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, రెవెన్యూ అసోసియేషన్ ఉద్యోగులు సంయుక్త కలెక్టర్‌కు స్వాగతం పలికి.. శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్‌పై జిల్లా సర్వేయర్ ల్యాండ్ రికార్డ్సు అధికారి, వారి సిబ్బందితో సంయుక్త కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. తరువాత కలెక్టరేట్ విభాగ పర్యవేక్షకులతో సమీక్షించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు

'ప్రచార భేరి'ని జయప్రదం చేయాలి

- మోడీని గద్దె దించాలి
- 'ప్రచార భేరి' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

3లో

తాగునీటి కొరత లేకుండా

చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో వేసవి రావటంతో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ జిల్లాలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ మంచినీటి కొరత కొనసాగుతోందన్నారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా ఇళ్లకు నీళ్లురాని కుటుంబాలు జిల్లాలో 4,98,290 ఉన్నాయని, 261 గ్రామాలకు ట్యాంకర్ల సరఫరా ద్వారా మంచినీరు వినియోగించుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. వీటిలో ప్రస్తుతం 119 గ్రామాలకు మాత్రమే 200 ట్యాంకుల ద్వారా 1188 ట్రిప్పుల నీరు సరఫరా చేస్తున్నారన్నారు. 2658 చేతి పంపులు, 232 డీప్ బోర్‌వెల్స్‌లో నీరు ఇంకిపోయి నిరుపయోగంగా ఉన్నాయని, 116 రక్షిత మంచినీటి పథకాలు పనిచేయటం లేదన్నారు. ఉన్న మంచినీటి పథకాలు రిపేర్లకు నోచుకోక సామర్థ్యం తగ్గి సరిపడా నీరు సరఫరా కావడం లేదన్నారు. సాగర్ కాలువ ద్వారా 137 తాగునీటి చెరువులకు నీరు పెట్టే ప్రక్రియ సంపూర్తిగా జరగలేదని, పశ్చిమ ప్రాంతంలో 12 మండలాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. 2019 నుండి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా కాంట్రాక్టర్లకు 138 కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఒంగోలు నగరం, కనిగిరి, చీమకుర్తి, దర్శి, గిద్దలూరు, పొదిలి, మార్కాపురం పట్టణాలలో ప్రభుత్వం చేపట్టిన మంచినీటి పథకాల పూర్తిగా ఉత్తర్వులు ఇచ్చారని, నిధులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఫలితంగా కొన్ని నత్తనడకన సాగుతున్నాయని, మరికొన్ని కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో తాగునీటి సమస్య జఠిలమవుతుందని, రక్షిత మంచినీటి కోసం ప్రజలు ఖాళీ బిందెలతో జాగారం చేయడం, సొంత ఖర్చులతో కొనుక్కోవాల్సిన స్థితి వచ్చిందన్నారు. తక్షణమే జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ పెట్టి తాగునీటి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రక్షిత మంచినీటి పథకాల నిర్మాణం, రిపేర్లు, ట్యాంకర్ల సరఫరాకు అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరారు. మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ప్రజలు ఉద్యమిస్తారని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, షేక్ మాబు, ఎం.రమేష్, డి.సోమయ్య, ఊసా వెంకటేశ్వర్లు, వి.ఆంజనేయులు పాల్గొన్నారు.



ఎండలు బాబోయ్.!

మద్దిపాడులో అత్యధికంగా 43.27 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-మద్దిపాడు

వేసవిలో ఎండల తీవ్రత పెరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్నారు. సెగ తట్టుకోలేక విలవిలలాడుతున్నారు. మంగళవారం నుంచి జిల్లాలో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. బుధవారం ఎండల తీవ్రత మరింత పెరిగింది. జిల్లాలో పలు చోట్ల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మద్దిపాడులో అత్యధికంగా 43.27 డిగ్రీలు నమోదు కాగా.. మర్రిపూడిలో 43.2, అర్ధవీడులో 42.9, దొనకొండలో 42.84, కంభంలో 42.66, కురిచేడులో 42.56, బల్లికురవలోనూ 42.45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా మధ్యాహ్న సమయాల్లో వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ముందుముందు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండలు అధికంగా ఉన్నాయని, ప్రజలెవరూ మధ్యాహ్న సమయాల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని మద్దిపాడు తహశీల్దార్ జి.రజనీకుమారి సూచించారు.

నిత్యావసరాలు అందజేత

పెద్దదోర్నాల : మండల పరిధిలోని రోళ్లపెంట గిరిజన గూడెంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజ్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనలు మౌలిక స్థితిగతులు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం గిరిజనులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కేతి వెంకట మోహన్ మురళి, నాయకులు గుర్రాల ప్రసాద్, చల్ల మధుసూదన్ రెడ్డి, చంద్ర, బాల కుమార్, విష్ణు, అంజి నాయుడు, అజయ్ పాల్గొన్నారు.

కళాశాల సిబ్బందికి వైద్య పరీక్షలు

టంగుటూరు : ఆరోగ్య పరిరక్షణ పట్ల కళాశాల సిబ్బంది ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ సూచించారు. స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో అపోలో డయాగ్నస్టిక్స్, హార్లిక్స్ ఉమెన్స్ ప్లస్ ఆధ్వర్యంలో కళాశాల సిబ్బందికి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందికి విటమిన్ డి, బి12, ఐరన్, కాల్షియం, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మూర్తి, ఎఒ రమణబాబు, ఉమెన్ ఎంపవర్ మెంట్ కోఆర్డినేటర్ వైష్ణవి, ఆరోగ్య పర్యవేక్షకులు డాక్టర్ బ్రహ్మం, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి

గుంటూరు ఆర్‌జెడి వివిఎస్.సుబ్బారావు

ప్రజాశక్తి-పొదిలి

ప్రతివిద్యార్థి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరాలని గుంటూరు ఆర్‌జెడి విఎస్. సుబ్బారావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పొదిలి పూర్వ సమితి అధ్యక్షుడు దివంగత మొల్లల రామిరెడ్డి, పొదిలి మాజీ ఎంపిపి దివంగత మొల్లల వెంకాయమ్మ, మర్రిపూడి మాజీ ఎంపిపి దివంగత మొల్లల రామాంజనేయ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు మొల్లల శ్రీనివాస రెడ్డి, సంధ్యారాణి దంపతుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి విఎస్. సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా కానుకతో సహ ఎనిమిది రకాల వస్తువులను రాబోవు విద్యా సంవత్సరంలో ముందుగానే అందించేందుకు కృషి చేస్తున్నటు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో మంచి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఏరోజు పాఠాలు ఆరోజు చదువుకుని పరీక్షలు రాయడం ద్వారా సమయం వృథా కాదని తెలిపారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిని గ్లోబల్ స్టూడెంట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ ఏడాది ఆంగ్ల మాధ్యం, సిబిఎస్ఇ సిలబస్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాబోవు కాలంలో ప్రతి ప్రభుత్వ పాఠశాల తరగతి గదిలో ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటిద్వారా త్రిడి చిత్రంలో పాఠ్యాంశ్యాలు, బోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దాతల సహకారంతో సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన పాఠశాల పూర్వ విద్యార్థిని, విశ్రాంత ఉపాధ్యాయురాలు దోర్నాల వరలక్ష్మమ్మకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్‌జెడి సుబ్బారావు, విగ్రహ దాత మొల్లల శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులు, దోర్నాల వరలక్ష్మమ్మను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్డులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఇంజినీరు మాకినేని వెంకట రమణయ్య మర్రిపూడి ఎంఇఒ, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు, పొదిలి ఎంఇఒ శ్రీనివాస రెడ్డి, మర్రిపూడి ఎంపిపిలు వాకా వెంకట రెడ్డి, ముండ్లమూరు ఎంపిపి సుంకర బ్రహ్మానంద రెడ్డి, కెకెమిట్ల, పొదిలి మాజీ జడ్‌పిటిసిలు మెట్టు వెంకట రెడ్డి, సాయి రాజేశ్వరరావు, గుజ్జుల సంజీవ రెడ్డి, గీతాంజలి విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ భాగ్యలక్ష్మి, రావూరి దుర్గా ప్రసాద్, అలేఖ్య, శ్రీనివాసరావు శారద, వైసిపి నాయకులు, పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు ఆజెడి సుబ్బారావు

అక్టోబర్‌లో 'వెలిగొండ'ను ప్రారంభిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

టిడిపి తొలగించిందన్నారు. పొదుపు మహిళలకు రుణాలు మాఫీ అంటూ మోసం చేసింది చంద్రబాబు కాదా? అని అడిగారు. తాము ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు పొదుపు రుణాల మాఫీ మూడు విడతలు జరిగిందన్నారు. మరో విడత కూడా జరుగుతుందని చెప్పారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు కూడా చంద్రబాబు దిగే సమయంలో రెండు నెలల ముందు రూ.రెండు వేలు చేశారన్నారు. తాము అధికారంలోకి రాగానే రూ.2250 చేశామని, ఇప్పుడు రూ.2750కి ఇస్తున్నామని చెప్పారు. త్వరలో పింఛను రూ.3 వేలు అందుతుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని..

నవరత్నాల్లో పథకాల్లో అధిక భాగం మహిళలకే కేటాయించామని సిఎం జగన్ చెప్పారు. అందులో ఈ నాలుగేళ్లలో రూ.2.7 లక్షల కోట్లు నేరుగా ఖాతాల్లో వివిధ పథకాల ద్వారా ఎలాంటి వివక్ష లేకుండా జమ చేయడం జరిగిందన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఈ విధంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో లంచం లేకుండా జమ కావడం లేదన్నారు. ఇక్కడ అమలవుతున్న పథకాలను పొరుగు రాష్ట్రాలు కాపీ కొట్టే పరిస్థితిలో ఉన్నాయన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లయితే రాష్ట్రం కూడా బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అందుకే మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా అవకాశాలు కల్పించామన్నారు. మహిళలకు 50 శాతం అన్నింటా వాటా ఉండేలా చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల పేరుతో ఇంటి స్థల పట్టాలు 30 లక్షల వరకు ఇచ్చామని, అందులో 22 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో ఇంటి విలువ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. ఆ విలువ ఇంటి యజమానిగా మహిళకే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇబిసిల్లో అగ్రవర్ణ పేద కుటుంబాలకు కూడా అండగా మీ బిడ్డ జగన్ ప్రభుత్వం నిలిచిందన్నారు. చంద్రబాబు సిఎంగా ఉన్న ఐదేళ్లలో ఏం పథకాలతో ప్రజలను ఆదుకున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. ఇప్పుడిచ్చిన పథకాల డబ్బు ఎక్కడికెళ్లిందన్నారు. టిడిపి అధికారంలో ఉండగా దోచుకో... పంచుకో... తిను.. (డిపిటి) పద్ధతిలో నిధులు కాజేశారన్నారు.

ఇబిసి నేస్తం రెండవ విడత ప్రారంభం

అగ్రవర్ణ పేదల్లోని మహిళా లోకాన్ని ఆదుకునేందుకు వైఎస్‌ఆర్ ఇబిసి నేస్తం పథకాన్ని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురంలో బుధవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.39 లక్షల మంది 45-60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన ఇబిసి మహిళలకు రూ.659 కోట్ల నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా బటన్ నొక్కారు. పసిగుడ్డు దగ్గర నుంచి వృద్ధుల వరకు ఎన్నో రకాల పథకాలతో ఆదుకోవడం జరుగుతోందని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ సందర్భంగా వివరించారు.

నాలుగేళ్లలో రూ.1100 కోట్ల అభివృద్ధి

మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో మార్కాపురం నియోజకవర్గంలో రూ.1100 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేసిన ఘనత సిఎం జగన్‌కు దక్కిందన్నారు. మెడికల్ కాలేజి మంజూరు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి పాదాభివందనాలు తెలిపారు. పొదిలి పెద్దచెరువుకు పైప్‌లైన్ ద్వారా సాగర్‌నీటిని నింపి పొదిలి ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.50 కోట్లు మంజూరు చేసిన సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 40 సంవత్సరాలుగా ఎవ్వరూ చేయని పనిని సిఎం జగన్ చేశారన్నారు. మార్కాపురం మున్సిపాలిటీకి సాగర్ నీటిని అందించింది డాక్టర్ రాజశేఖరరెడ్డి అని చెప్పారు. రెండవ విడత కూడా మిగిలిపోయిన పది వార్డుల్లో పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 5.20 కోట్లు మంజూరు చేసింది సిఎం జగన్ అని చెప్పారు. మార్కాపురం మున్సిపాలిటీలో షాదీఖానా నిర్మాణానికి రూ.2 కోట్లు, అంబేద్కర్ భవన్ నిర్మాణం, బీసీ భవన్ నిర్మాణం కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి కోరిన వాటిని మంజూరు చేస్తున్నట్లు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సభలో ప్రకటించారు. వేదిక వద్దనే పొదిలి పెద్ద చెరువు ద్వారా పొదిలి ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.50 కోట్ల పథకానికి, మార్కాపురంలో ఇంటర్నల్ పైప్‌లైన్ నిర్మాణాలకు రూ.5.20 కోట్ల పనులకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన గావించారు. పొదిలి పట్టణంలో మెయిన్ రోడ్డు, డ్రెయిన్‌కు రూ.11 కోట్లు మంజూరు చేశారు. సభలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్‌కుమార్ మాట్లాడారు.

వేదికపై మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, తూమాటి మాధవరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, బాచిన కృష్ణ చైతన్య, కరణం వెంకటేష్, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, మార్కాపురం ఎంపిపి పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి, పొల్యూషన్ బోర్డు మెంబర్ వెన్నా హనుమారెడ్డి, వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషీర్ అలిబేగ్, కదిరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- దొనకొండ

మండల పరిధిలోని పడమట వెంకటాపురం గ్రామంలోనున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎంపిపి బొరిగొర్ల ఉషామురళీ దంపతులు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు.

బెట్టకొచ్చిన పైర్లకు నీటి తడులివ్వండి

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

ప్రజాశక్తి-బాపట్ల

ఎండల ధాటికి బెట్టకొచ్చిన ఆరుతడి పంటలకు దశలవారీగా నీరందించి కాపాడుకోవాలని బాపట్ల వ్యవసాయ శాఖ డిడిఏ విజయనిర్మల రైతులకు సూచించారు. బుధవారం బాపట్ల మండలం ముత్తాయపాలెం పరిసర ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న ఆరుతడి పంటలు మినుము, రాగి పైర్లు ఎండ వేడి, వడగాల్పులకు బెట్టకొచ్చాయని, ఈ పైర్లకు నీటి తడులు అందించి అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు.

మండలంలోని ముత్తాయపాలెం, మద్దిబోయినవారిపాలెం ప్రాంతాల్లో వ్యవసాయ పొలాలను సందర్శించారు. పెరలి



మినుము పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

డ్రెయిన్ నీటి ద్వారా సాగు చేస్తున్న మినుము పైరుపై చీడపీడల నివారణకు 13-0-14 మల్టీకే 1కిలో మందు ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేసి నివారించుకోవచ్చన్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో సాగుచేసే రాగి పైరుపై ఆశించే అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగు నివారణకు క్లోరిఫైరిఫాస్ అరలీటర్ మందు ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేయాలన్నారు. పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ క్షేత్ర సందర్శనలో వ్యవసాయ శాస్త్రవేత్త సాంబశివరావు, బాపట్ల ఉప్పునీటి పరిశోధన స్థానం శాస్త్రవేత్త మృదుల, ఏడిఏ లక్ష్మి, ఏవో శారద, ఏఈవోలు పాల్గొన్నారు.

స్కూటర్ అదుపుతప్పి విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు

స్కూటర్ అదుపుతప్పి రోడ్డుపై ఉన్న టివిఎస్ బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో డిగ్రీ విద్యార్థిని రామలక్ష్మి(20) మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన జేస్తాది నరసింహారావు, విజయలక్ష్మి రెండో కుమార్తె రామలక్ష్మి పొదిలి మండలం బెల్లంకొండ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో ఏజిబిఎస్సీ పూర్తిచేసి దర్శిలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిప్లొమా చదువుతోంది. టీడీపీ ప్రభుత్వం కాలంలో బాలిక సంరక్షణ పథకంలో ఇద్దరు ఆడపిల్లలకు డబ్బులు వేశారని, రావినూతల బ్యాంకులో బాలిక సంరక్షణ డబ్బులు మెచ్యూరిటీ కావడంతో వాటిని తీసుకోవడానికి తన స్నేహితుడైన గోపితో కలిసి స్కూటీ నడుపుతూ రాజంపల్లి నుంచి బయలుదేరి అద్దంకి వస్తుండగా రెడ్డినగర్, ఉల్లగల్లు మధ్యలో స్కూటీ అదుపుతప్పి టివిఎస్ బైక్‌ను ఢీకొట్టడంతో రామలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. గోపికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి ముండ్లమూరు పోలీసులు వెంకటేశ్వర్లు, రైటర్ మరియబాబు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.



మృతిచెందిన విద్యార్థిని రామలక్ష్మి (ఇన్‌సెట్‌లో) రామలక్ష్మి (ఫైల్)



మాట్లాడుతున్న మండవ ఫౌండేషన్ నిర్వాహకులు

పర్యావరణ పరిరక్షణే.. ప్రజారోగ్యానికి రక్ష

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజల ఆరోగ్య రక్షణ పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉందని, దీనిపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని హైదరాబాద్ మండవ ఫౌండేషన్ చైర్మన్ మండవ ఆషాప్రియ అన్నారు. బుధవారం సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అశ్విని సంచార వైద్యశాలకు మండవ ఫౌండేషన్, ఎన్ఎస్ఎల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సౌజన్యంతో సమకూర్చిన నూతన సంచార వైద్య వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆషాప్రియ మాట్లాడుతూ సేవ చేయడం వల్ల మానసిక ఆనందంతోపాటు శారీరకంగా ఆరోగ్యంగానూ ముందుకు సాగగలమని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే ప్రజలకు ఎంత ఆరోగ్యం అందించినా నిరుపయోగమేనన్నారు. విషతుల్యమవుతున్న వాతావరణ పరిస్థితుల నుంచి ప్రజలను కాపాడుకోవడానికి స్వచ్ఛంద సేవ సంస్థలు ముందుకు రావాలన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో పర్యావరణం పరిరక్షణపై విలువలతో కూడిన విద్యను నేటి తరం విద్యార్థులకు అందించాలన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందనే అంశాన్ని గుర్తెరగాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిన బూనాలన్నారు. కార్యక్రమంలో గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు కేఎస్ఎన్ చారి, మానం మల్లీశ్వరి, గౌతమ్ జి, సంచార వైద్యశాల వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినా పిలుపునిచ్చారు. బుధవారం బాపట్ల కలెక్టరేట్‌లో వైఎస్ఆర్ఇబిసి నేస్తం ముఖ్యమంత్రి వర్చువల్ లాంచింగ్ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. రాష్ట్రంలో కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. పాదయాత్ర సమయంలో పేదల కష్టాలు చూసిన ముఖ్యమంత్రి అగ్రవర్ణాల పేదల కోసం వైఎస్ఆర్ ఇబిసి నేస్తం కార్యక్రమం ద్వారా పేద ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలకు గృహాలను నిర్మించడానికి పెద్దఎత్తున చర్యలు తీసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. బాపట్ల జిల్లాలో వైఎస్ఆర్ ఇబిసి నేస్తం కింద 26 వేల 221 మందికి రూ.39.28 కోట్లను బటన్ నొక్కి ముఖ్యమంత్రి లబ్ధిదారుల ఖతాలకు జమ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ వైఎస్ఆర్ ఇబిసి నేస్తం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార మార్కెటింగ్ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఏడుకొండలు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గోలికుమారి, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, బిసి కార్పొరేషన్ పరిపాలనా అధికారి నరసింహమూర్తి, మహిళలు పాల్గొన్నారు.



ఇబిసి నేస్తం నమూనా చెక్‌ను అందజేస్తున్న గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినా, ప్రజాప్రతినిధులు

బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు(వేమూరు)

వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన అత్మూర్ సాంబశివరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బుధవారం మృతుని భార్యకు జెడ్పిటిసి గాజుల హేమలత చేతుల మీదుగా వైఎస్ఆర్ భరోసా కింద మంజూరయిన రూ.లక్షతో ముందుగా రూ.10 వేలు మట్టి ఖర్చుల నిమిత్తం అందజేశారు. మిగిలిన సొమ్ము త్వరలోనే జమ చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాజుల భాను ప్రకాష్, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏపీ జెఏసి అమరావతి ఉద్యోగులు

కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జేఏసి చైర్మన్ సిహెచ్ సురేష్‌బాబు కోరారు. బుధవారం ఏపీ జెఏసి అమరావతి బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జేఏసీ భాగస్వామ్య సంఘా లు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు సంఘం, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల భాగస్వామ్యంతో బాపట్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహించారు. ఈ ధర్నాకు ఏపీ జేఏసి బాపట్ల జిల్లా చైర్మన్ సిహెచ్ సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి టి రజనీకాంత్, ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు వై శ్రీనివాసరావు, కో ఆపరేటివ్ సంఘ అధ్యక్షులు కె మురళీ మోహన్‌రెడ్డి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఇంజినీరిం గ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం డిఎ, పిఆర్‌సీ, అరియర్స్, ఇతర ఆర్థిక అంశాలతో పాటు ఆర్థికేతర అంశాలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. జీతాలను సకాలంలో ఇవ్వాలని, రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో పెన్షన్లు ఇతర ఆర్థిక సౌకర్యాలను జాప్యం లేకుండా అందించాలని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏపీ జెఏసి అమరావతిలోని భాగస్వామ్య సంఘాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, ఇతర బాధ్యులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాధ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది, సర్వే శాఖ సూపరింటెండెంట్ ఉద్యోగులు, కోఆపరేటివ్ సంఘ నాయకులు, విఆర్ఒ, విఆర్ఏ, ఆర్‌టిసి ఉద్యోగులు పాల్గొన్నారు.



యాగం నిర్వహిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులు

రెండో రోజు రాజశ్యామల యాగం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు టిటిడి కళ్యాణ మండపంలో జరుగుతున్న రాజశ్యామల యాగం బుధవారం రెండోరోజు దిగ్విజయంగా జరిగింది. ఉదయం, సాయంత్రం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతుల చేత వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి నేతృత్వంలో వేదపండితులు యుగాది క్రతువులు చేయించారు. ప్రదోషకాల పూజలు, రాజశ్యామల యాగంలో భాగంగా మహా గణపతి, మహా మృత్యుంజయ తదితర యోగ క్రతువులు పండితులు బాలినేని దంపతుల చేత చేయించారు. అనంతరం రాజాశ్యామల మాతకు సప్తహారతులు, మహామంత్ర పుష్పం నిర్వహించి, అమ్మవారికి దర్బార్ సేవ విశేషంగా చేపట్టారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

వాలంటీర్లతో పార్టీ పనులా?

కార్పొరేటర్ మలగా రమేష్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రభుత్వ పరిధిలో ఉద్యోగాలు చేస్తున్న వాలంటీర్లతో జగన్ ప్రభుత్వం పార్టీ కార్యక్రమాలు చేయించడం ఎంతవరకు సబబని జనసేన ఒంగోలు నగర అధ్యక్షులు, 38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అనే పార్టీ కార్యక్రమాన్ని వాలంటీర్ల చేత చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. వాలంటీర్లు గడప గడపకూ తిరుగుతూ ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అంటిస్తున్నారని దుయ్యబట్టారు. ఇంటి యజమానికి ఇష్టం ఉన్నా లేకున్నా స్టిక్కర్లను అంటించి వెళుతున్నారని, ఇదెక్కడి చోద్యమని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జగన్ సర్కార్ ప్రజల్లోకి వెళ్లేందుకు అనేక దొడ్డిదారులు ఎంచుకుంటోందన్నారు. ప్రజలు గమనించాలని, జగన్ సర్కార్ చౌకబారు ఎత్తుగడలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సెల్ టవర్ వద్దని గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి మండలంలోని మణికేశ్వరంలో ఎయిర్ టెల్ సెల్ టవర్ నిర్మాణం చేపట్టవద్దని ఆ గ్రామస్తులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సెల్ టవర్ పనులను నిలిపివేయాలని భీష్మించుకు కూర్చున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ సెల్ టవర్ నిర్మాణం వలన రేడియేషన్ ప్రభావం ఉంటుందని, అది తమ పిల్లల భవిష్యత్తుకే కాకుండా ఆరోగ్యపరంగా అనేక సమస్యలు తలెత్తుతాయని తెలియజేశారు. ఈ విషయం గురించి స్థానికులు ఆందోళనకు దిగారు. నివాస సముదాయాల మధ్య రేడియేషన్ వెదజల్లే సెల్‌టవర్ ఎలా నిర్మిస్తారంటూ స్థానికులు అడ్డం తిరిగారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె కరీముల్లా, ఎస్‌కె బాషా, మైనారిటీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కమ్యూనిస్టు జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 14 నుంచి మే 15 వరకు జరిగే ప్రజా చైతన్య యాత్రను జయ ప్రదం చెయ్యాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి నాగాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సంతమాగులూరు ఎస్ఐగా ఎంవి శివకుమార్

ప్రజాశక్తి-సంతమాగులూరు



సంతమాగులూరు ఎస్ఐగా ఎంవి శివకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన ఎస్ఐ నాగ శివారెడ్డి విఆర్‌కు బదిలీ అయ్యారు. శివకుమార్ కొరిశపాడు మండలం మేదరమెట్ల పిఎస్‌లో పనిచేస్తూ బదిలీపై సంతమాగులూరుకు వచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



చెరుకూరులో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పోతుకట్ల, కొమర్నేనివారిపాలెం గ్రామాల్లో గర్భిణులకు 12 రకాల పౌష్టికాహార పదార్థాలను డాక్టర్ల సలహా మేరకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెరుకూరు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ ఎం గౌతమ్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, క్యాల్షియం, ఐరన్ మాత్రలు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా దగ్గరలోని డాక్టర్ల సలహాలను తీసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా పోతుకట్ల ఎంపిటిసి పంబి కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానంద రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం పౌష్టికాహార ప్యాకెట్లను రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు దంపతులు గర్భిణులకు అందజేశారు.

'ఫుడ్ సైన్స్' విద్యార్థులకు జేఆర్ఎఫ్ ర్యాంకులు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



హర్షిత

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఢిల్లీ ఇటీవల నిర్వహించిన పీజీ అర్హత పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారని కళాశాల అసోసియేట్ డీన్ రాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థిని పీ హర్షిత వెంకటసాయి అనే విద్యార్థిని మొదటి ర్యాంకు సాధించిందన్నారు. దీంతో ఆమెకు జేఆర్ఎఫ్ ఫెలోషిప్ వస్తుందని వెల్లడించారు. ఇది తమ కళాశాలకు, ఆచార్య ఎన్‌జీ రంగా యునివర్సిటీకి గర్వకారణమని అన్నారు. అలాగే ఎస్ జయశ్రీ 12, వెంకట రుక్మిణి 13, సుగున్యారావు 10 ర్యాంకులు సాధించారన్నారు. మొదటి ర్యాంకు సాధించిన హర్షితకు ఆనంద్ అగ్రికల్చర్ యునివర్సిటీలో సీటు వచ్చిందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.



ఆటోలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివకుమార్

అడ్డరోడ్ జంక్షన్‌లో ఆటోల తనిఖీ

ప్రజాశక్తి-సంతమాగులూరు: పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తీసుకువెళ్లే, ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ ఎన్‌వి శివకుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని అడ్డరోడ్ జంక్షన్‌లో పలు ఆటోలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తున్న ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల హైవే రహదారులపై జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా, పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని ఆయన ఆటో డ్రైవర్లకు సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అధికారం అండతో యథేచ్ఛగా..

రేషన్ బియ్యం అక్రమ దందా

అధికారులకు సవాలు విసురుతున్న స్వర్ణ రైస్ మిల్లు ● చేతులెత్తేసిన జిల్లా అధికారులు ● పక్క జిల్లాల అధికారులు వచ్చి దాడులు చేస్తున్న వైనం





స్వర్ణ రైసు మిల్లు వద్ద విజలెన్స్ అధికారుల వాహనాలు (ఫైల్), స్వర్ణ రైసు మిల్లులో తనిఖీలు చేస్తున్న విజలెన్స్ అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో అధికార పార్టీ నేతల సారధ్యంలో ఉన్న రైసు మిల్లు ప్రభుత్వాధికారులకు సవాల్ విసురుతుంది. అధికారం అండగా ఈ మిల్లు కేంద్రంగా యథేచ్ఛగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ దందాను నిలువరించడం అధికారులకు సాధ్యం కావడం లేదు. జిల్లాలోని రెవెన్యూ, విజిలెన్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ఈ మిల్లులో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమదందాను అడ్డుకోలేక పోతున్నారు. అసలు అటు వైపు వెళ్లే సాహసం కూడా చెయ్యడం లేదు. దీంతో రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేరుతున్నా యి. వారు పక్క జిల్లాల అధికారులను దాడులకు పంపుతున్నారు. రెండు రోజుల క్రితం స్వర్ణ మిల్లుపై గంటూరు, కృష్ణా జిల్లాల నుంచి వచ్చిన విజిలెన్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు దాడులు జరిపారు. ఆ సమయంలో మిల్లు వద్ద ఉన్న అధికార పార్టీ నేత అనుచరులు అధికారులపై దాడి చేశారు. మిల్లులో ఉన్న అక్రమ రేషన్ బియ్యాన్ని ఒక అధికారి తన సెల్ ఫోన్‌లో చిత్రీకరిస్తున్న సమయంలో దాడి చేసి సెల్ పగులగొట్టారు. ఈ మేరకు కారంచేడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. కాగా జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందాలో ఆరితేరిన వారి మధ్య తలెత్తుతున్న విభేదాల కారణంగానే పక్కదారి పడుతున్న పేదల బియ్యం అరకొరగా అధికారులకు పట్టుబడుతుంది. జిల్లా అధికారులు ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణా గురించి ఎన్ని సార్లు సమీక్షలు జరిపినా, హెచ్చరించినా రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారులకు సరఫరా చేస్తున్న బియ్యం నాశిరకంగా ఉంటూ పేద, బలహీన వర్గాల వారు కూడా అన్నంగా వండుకుని తినేందుకు అనువుగా ఉండడం లేదని తెలుస్తుంది. అత్యధికులు దోశలు వేసుకునేందుకు మాత్రమే ఈ రేషన్ బియ్యాన్ని ఉపయోగిస్తున్నారు. మిగిలిన కార్డుదారులు తమకు వచ్చే బియ్యంకు సరిపడా వచ్చే నగదు తీసుకుని రేషన్ బియ్యాన్ని పంపిణీ కోసం వస్తున్న వాహనదారునికే ఇచ్చేస్తున్నారు. ఇలా మిగిలిన బియ్యం తిరిగి రేషన్ షాపులకు అక్కడ నుంచి మిల్లులకు రీసైక్లింగ్ కోసం వెళుతున్నాయి. ఇలా ప్రతి రేషన్ షాపుకు వస్తున్న బియ్యంలో 80 శాతం మిగిలిపోతున్నట్లు చెబుతున్నారు.

ఇలా జిల్లా వ్యాప్తంగా మిగిలిపోతున్న వందల బస్తాల రేషన్ బియ్యం ప్రతి నెల అక్రమమార్గం పడుతుంది. ఇంత భారీ మొత్తంలో మిగులుతున్న రేషన్ బియ్యాన్ని సేకరించి మిల్లుల్లో రీసైకిలింగ్ చేసి అమ్ముకునే శక్తి అధికారం అండగా ఉన్నవారి వల్లనే అవుతుంది. దీంతో నియోజకవర్గాలు, ఏరియాల వారీగా అధికారం అండగా అక్రమార్కులు పుట్టుకొచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని స్వర్ణ రైసు మిల్లు ద్వారా అత్యధికంగా రేషన్ బియ్యం రీసైకిలింగ్ జరుగుతూ వచ్చింది. గతంలో పర్చూరు నియోజకర్గాన్ని రెండు, మూడు ఏరియాలుగా విభజించుకుని అధికార పార్టీ నేతలు రేషన్ బియ్యం అక్రమ దందా సాగిస్తూ వచ్చారు. కొంత కాలం క్రితం పర్చూరులో అధికార మార్పిడి జరిగిన నేపథ్యంలో ముఖ్యమైన ఆదాయ వనరుగా ఉన్న రేషన్ బియ్యం దందా మొత్తం స్వర్ణ రైసు మిల్లు కేంద్రంగానే జరగాలన్న నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. గతంలో ఇతర రైసు మిల్లుల వారు ఒకరిద్దరు కూడా రేషన్ బియ్యం రీసైక్లింగ్ అమ్మకాలు జరిపేవారని తెలుస్తోంది. కాని మొత్తం రేషన్ బియ్యం వ్యాపారం స్వర్ణ మిల్లు ద్వారానే జరపాలని ముఖ్యనేత నుంచి హుకుం జారీ అయినట్లు చెబుతున్నారు. అయితే చేస్తున్న దొంగ వ్యాపారంలో రేషన్ బియ్యం తాలూకు నగదు చెల్లింపులు సక్రమంగా జరగనందున అంతిమంగా డీలర్లు నష్టపోతున్నారు. రేషన్ షాపుల డీలర్లకు అక్రమార్కుల నుంచి రూ.లక్షల్లో బకాయిలు రావలసి ఉన్నట్లు చెబుతున్నారు. ఇలా పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్న వారు తమ ప్రాంత నేతల ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇటీవలి కాలంలోనే నాలుగు పర్యాయాలు విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు స్వర్ణ మిల్లుపై దాడులు జరిపారు. చీరాల, పర్చూరు ప్రాంతాల్లో ఇటీవల వరుస దాడులు జరగడానికి కారణం బియ్యం అక్రమ వ్యాపారంలో ఉన్న వారి మధ్య తలెత్తిన విభేదాలే కారణమని తెలుస్తోంది. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంలో తమ ప్రత్యర్థులుగా ఉన్నవారు బియ్యం లోడ్ ఎత్తిన వెంటనే అధికారులకు ఈ విషయం చేరవేయడంతో వారు దారికాచి లారీల్లో వెళుతున్న బియ్యంను పట్టుకుంటున్నారు. అధికారులు కూడా తమకు సమాచారం వచ్చిన సందర్భాల్లో మాత్రమే నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భాల్లో కూడా అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిడి వస్తే సాధారణ కేసులు పెట్టి, సరుకును తక్కువగా చూయిస్తున్నారు.

స్వర్ణ రైస్ మిల్లులో ఇప్పటికి నాలుగుసార్లు దాడులు

కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామంలో ఉన్న రైస్ మిల్లులో ఇటీవలి కాలంలో నాలుగుసార్లు విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. వందల కొద్ది బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. నామమాత్రపు కేసులతో మమ అనిపించారు. గత నెలలో జరిగిన దాడుల్లో కూడా దాదాపు 2 వేల బస్తాలకు పైగా అక్కడ రేషన్ బియ్యం పట్టుబడినట్లు తెలిసింది. కాని మిల్లులో అక్రమంగా నిలువ ఉంచిన 605 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అప్పట్లో అధికారులు తెలిపారు. అధికారం అండ ఉన్న స్వర్ణ లాంటి మిల్లుల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమ దందా సాగిస్తున్నారు. సోమవారం జరిపిన దాడుల్లో 810 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమార్కులపై పీడి చట్టం ప్రయోగిస్తాం అని చెప్పడమే తప్ప ఎక్కడా అమలు కాలేదు. రేషన్ అక్రమార్కులపై సాధారణ కేసులు నమోదు కావడంతో సులభంగా కేసుల నుంచి బయటపడుతున్నారు. తిరిగి యథేచ్ఛగా పేదల బియ్యాన్ని అక్రమమార్గం పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇఫ్తార్ విందులో ప్రముఖులు



ఛందోలు గ్రామంలోని భగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

రంజాన్ పవిత్ర పండుగను పురస్కరించుకుని ఛందోలు గ్రామంలో టీడీపీ నాయకులు సయ్యద్ నిజాం ఆధ్వర్యంలో మీరా సహకారంతో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ వేడుకకు ప్రముఖ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, చీరాల టీడీపీ ఇన్‌ఛార్జి మాలకొండయ్య, బాపట్ల టీడీపీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, గుంటూరు-1 టీడీపీ పార్టీ కన్వీనర్ నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఒక సందడి వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు. రాబోయే రోజుల్లో టీడీపీ ప్రజలకు ఎలా వెన్నుదన్నుగా ఉంటుందో ప్రజలకు తెలియజేశారు. ఇప్పటి ప్రభుత్వంలో ప్రజలు ఎలా కష్టాలు పడుతున్నారో, నిత్యావసరాలు ధరలు ఎంతగా పెరిగాయో అనే అంశాలు ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి రాబోయే ఎన్నికలలో రావణ రాజ్యం నుంచి విముక్తి పొంది రామరాజ్యం నెలకొల్పే విధంగా కృషి చేయాలని సూచించారు. అందరూ కలిసే విధంగా వేదిక ఏర్పాటు చేసిన నిజాంను, మీరాను ముఖ్య అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల నడ్డి విరిచిన వైసిపి: మాజీ మంత్రి కన్నా

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

గతంలో ఉన్న సంక్షేమ పథకాలు తీసివేసి పేదల నడ్డి విరిచిన ఘనత వైసీపీకి దక్కుతుందని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఇప్పుడు వైసీపీ ఇచ్చేది సంక్షేమ కాదు, కేవలం లంచం అని ఆయన విశ్లేషించారు. రంజాన్ సందర్భంగా ఇఫ్తార్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన చర్చాగోష్టిలో మాట్లాడారు. ప్రజల సొమ్ముతోనే జగన్ పార్టీ సొంత కార్యక్రమాలు చేయటం బాధాకరమని పేర్కొన్నా రు. పేదలకు రూపాయి ఇచ్చి పది రూపాయలు దోచుకునే ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. మైనారిటీలకు పథకాలు లేకుండా చేసి ప్రేక్షకపాత్ర వహిస్తున్నాడని విమర్శించారు. రంజాన్ మాసంలో టీడీపీ హయంలో తోఫా అందచేసి పేద, ధనిక భేదం లేకుండా సంక్షేమం అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుం దని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు దేవుడు అయితే జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు రాక్షసుడిగా తయారయ్యారని అన్నారు. వైసిపికి ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్పి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయటం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం, మీరా, సోహరబ్ హారఫట్, సలాం నియాజ్, చీరాల టీడీపీ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య, బాపట్ల ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర, గుంటూరు1 టీడీపీ ఇన్‌ఛార్జి నసీర్ అహ్మద్, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



చర్చా గోష్ఠిలో పాల్గొన్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

'వెలిగొండ' నిర్వాసితుల్లో నిరాశ

మార్కాపురం జిల్లా ఊసెత్తని ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-మార్కాపురం

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనపై మార్కాపురం ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే వెలిగొండ నిర్వాసితుల గురించి, మార్కాపురం ప్రత్యేక జిల్లా గురించి సిఎం ప్రస్తావించకపోవడంతో నిర్వాసితులు, ఈ ప్రాంత ప్రజలు నిరాశకు గురయ్యారు. వైఎస్ఆర్ ఇబిసి నేస్తం పథకం ప్రారంభించేదుకు సిఎం బుధవారం మార్కాపురం వచ్చారు. ఈ సందర్భంగా సిఎం వెలిగొండ ప్రాజెక్టును సెప్టెంబరులో పూర్తి చేస్తామని, అక్టోబరులో ప్రారంభిస్తామని చెప్పారు. వెలిగొండ కోసం త్యాగం చేసిన నిర్వాసితుల గురించి ఒక్క మాట మాట్లాడలేదు. వెలిగొండ జలాశయంలోకి నీరు రావాలంటే నిర్వాసితులు గ్రామాలు ఖాళీ చేయాల్సి ఉంది. ఖాళీ చేయాలంటే ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఒక్కో కుటుంబానికి రూ. 12.5 లక్షల ప్యాకేజి ఇవ్వాల్సి ఉంది. ముంపు గ్రామాల్లోని నిర్వాసితులను ఖాళీ చేయించాలంటే రూ. 1200 కోట్ల వరకు అవసరం. భారీ బడ్జెట్ గురించి ఏమీ మాట్లాడలేదు. వెలిగొండకు మొన్నటి బడ్జెట్‌లో కేటాయింపులు రూ. 101 కోట్లు మాత్రమే. అందులో రూ. 35 కోట్లు కరెంటు బిల్లుకు పోయినట్లు తెలిసింది. మిగిలింది రూ. 65 కోట్లు మాత్రమే. కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో రూ. 100 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. నిర్వాసితులకు ప్యాకేజి ఎప్పుడిస్తారో చెప్పనేలేదు. వెలిగొండ ప్రారంభి స్తామని మాత్రం చెప్పారు. నిర్వాసితుల సంగతి తేలకుండా వెలిగొండ పంచాయతీ తెగదని స్థానికులు అంటున్నారు. మార్కాపురం జిల్లాగా ఏర్పాటు అవసరమే. కానీ ఇక్కడి ప్రజా ప్రతినిధులు సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా అంశాన్ని గుర్తు చేయలేదు. మార్కాపురం జిల్లా చేయాలనే ఆలోచన సిఎం జగన్‌కు లేదు. జిల్లా కేంద్రమైన ఒంగోలుకు మార్కాపురం డివిజన్ ప్రజలు వెళ్లాలంటే ఆర్థిక ఇబ్బందులతో పాటు సమయాన్ని వృథా అవుతోంది. ఈ ప్రాంత ప్రజల్లోనూ మార్కాపురం జిల్లా ఆకాంక్ష బలంగా ఉంది. అర్హత కలిగిన మార్కాపురం జిల్లా కాకపోవడంపై కూడా అన్యాయమని ప్రజలు అంటున్నారు. ఒంగోలు కేంద్రానికి నల్లమల అటవీ ప్రాంత గ్రామాలు 200 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. సుదూరంగా జిల్లా కేంద్రం ఉంటే పాలనా సౌలభ్యం ఏపాటిదో అర్థం చేసుకోవాలి. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతుండగా కొందరు యువకులు మార్కాపురం జిల్లా చేయాలని నినదించారు. ఈ విషయం వేదిక వద్దకు వినిపించినా సిఎం జగన్ పట్టించుకోలేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా జిల్లా అవసరమని కోరలేదు. దీంతో జిల్లా ప్రకటనకు అవకాశం లేకుండా పోయింది.



పొదిలి పెద్ద చెరువుకు శంకుస్థాపన చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి



ఫారెస్టు అధకారులు పట్టుకున్న కొండ చిలువ

కొండ చిలువ పట్టివేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు సమీపంలోని చిరదల నాగేష్‌కు చెందిన నిమ్మ తోటలో 14 అడుగుల కొండ చిలువ కలకలం రేపింది. తోటలోకి వెళ్లిన రైతు నాగేష్‌కు బుధవారం కొండ చిలువ కనిపించింది. దీంతో రైతు ఈ విషయం గురించి ఫారెస్ట్ స్నేక్ రీస్క్యూర్ మల్లికార్జునకు సమాచారం అందించారు. మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకొని చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నాడు. ఈ సంధర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ తాము పట్టుకున్న కొండ చిలువను నల్లమల అటవీ ప్రాంతంలో వదిలేస్తామని తెలిపారు.

సిఎం జగన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-మార్కాపురం

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా బుధవారం మార్కాపురం విచ్చేశారు. జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద నుంచి జగన్‌కు స్థానిక నేతలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. సిఎం హెలిప్యాడ్ నుంచి బుల్లెట్‌ప్రూఫ్ బస్సులో రోడ్డు మార్గాన ఎస్‌వికెపి కళాశాల వేదిక వద్దకు ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. దారి పొడవునా సిఎం జగన్‌ను చూసేందుకు వేలాదిగా జనం బారులు తీరారు. జగన్‌పై పూల వర్షం కురిపించారు. పెద్ద ఎత్తున స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, వైసిపి ముఖ్య నేతలు పుష్పగుచ్ఛాలతో సిఎంకు స్వాగతం పలికారు. సిఎం జగన్‌ను సత్కరించేందుకు పోటీ పడ్డారు. హెలిప్యాడ్ వద్ద సిఎం జగన్‌ను చూసేందుకు సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కె.పి.కొండారెడ్డి వేచివున్నారు. ఆరోగ్యం బాగోలేకపోయినా జగన్‌పై ఉన్న అభిమానంతో కొండారెడ్డి రావడంతో సిఎం జగన్ గమనించారు. పెద్దాయన ఆరోగ్య విషయాలను జగన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌వికెపి కళాశాల వద్ద వేదికపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్నం 12:40 వరకు ఉన్నారు.



పుష్పగుచ్చం అందజేస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న మంత్రి సురేష్



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న మాజీ మంత్రి శిద్దా



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే వేణుగోపాల్



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్సీ మాధవరావు




సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే రాంబాబు




సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎస్‌పి మల్లిక గర్గ్



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు



సిఎంకు పుష్పగుచ్చం అందజేస్తున్న బాలినేని కృష్ణచైతన్య

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-టంగుటూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న పజా వ్యతిరేక విధానాలను ప్రజలందరూ ఐకమత్యంగా తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, సిపిఐ కొండపి నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై ఈనెల 14 నుంచి సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రచార భేరీ కార్యమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల ప్రైవేటీకరణ విధానాలు దేశానికి పెను ప్రమాదంగా పరిణమించాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై మోడీ నీలి నీడలను నిరసించాలని వారు విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై అందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్యక హక్కులను కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గంటెనపల్లి శ్రీనివాసులు, వేశపోగు మోజెస్, కెజి. మస్తాన్, టంగుటూరి రాము, టంగుటూరి వెంకట్రావు, కొల్లాబత్తిన శ్రీను, సిపిఐ నాయకులు టి.ప్రభాకర్, బాలకోటయ్య, ఆర్. లక్ష్మీ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

యర్రగొండపాలెం : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకోవడానికి ఈనెల 14 నుంచి 30 వరకూ నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ప్రచార భేరికి సంబ ంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం అయిందన్నారు. బిజెపి ప్రభుత్వం అదాని, అంబానీ లాంటి సంపన్నులకు దేశ సంపదను దోచుపెడుతున్నారన్నారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరిని నిరంకుశంగా అణచివేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చెన్నయ్య, కెవి.కష్ణ గౌడ్, గురునాథం, బాణాల రామయ్య, నక్కా తిరుపతయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి వనజ

చలివేంద్రం ప్రారంభం

శింగరాయకొండ : వేసవిలో ప్రజల దాహార్తీ తీర్చేందుకు హెచ్ఎస్‌సి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన వేంద్రాన్ని ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని శింగరాయకొండ గ్రామ సర్పంచి తాటి పర్తి వనజ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా హెచ్ఎస్‌సి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తీని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, మాజీ సర్పంచి రాయి పెర్రాజు, వైసిపి పట్టణ కన్వీనర్ షేక్ పటేల్, షేక్ సలీం బాషా, అల్లభక్షు, కునపురెడ్డి శివశంకర్, షేక్ అల్లావుద్దీన్, చొప్పర వెంకన్న, సవలం కోటేశ్వరరావు, జాన్ కిషోర్, జాన్ సన్, సతీష్ పాల్గొన్నారు.

నేడు 'కందుల' పాదయాత్ర

తర్లుపాడు : మండల పరిధిలోని పోతలపాడు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గురువారం పాదయాత్ర నిర్వహించనున్నట్లు టిడిపి మండల ఉడుముల చిన్నపరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 11 గంటలకు గానుగపెంట నుంచి రాయవరం వరకూ పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లు, కోఆర్డినేటర్లు పాదయాత్ర పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వరి పంట పరిశీలన

దర్శి : వరిసాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టి రైతులు అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం కీటక విభాగం శాస్త్రవేత్త జాహ్నవి తెలిపారు. మండల పరిధిలోని తూర్పువెంకటాపురం గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వరిలో కాండం తొలిచే పురుగుల ఉధృతి అధికంగా ఉందన్నారు. వాటి నివారణకు క్లోరోఫైరీపాస్ 10 లీటర్ల నీటిలో 2.5 ఎంఎల్ లేదా ఎస్పేట్ 1.5 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త కాశీ విశ్వనాథ్, విఎఎ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

టంగుటూరు : తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమమే ఎల్డర్‌లైన్ లక్ష్యమని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు తెలిపారు. స్థానిక పిహెచ్‌సి ఆవరణలో ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 14567 బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ 2007లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం ఎల్డర్ లైన్ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మారుతున్న పరిస్థితులలో కుటుంబ వ్యవస్థలో పెద్దలు గౌరవం కోల్పోతున్నారని తెలిపారు. వయోవృద్ధులకు తగు సంరక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో ఎల్డర్ లైన్ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారు తమ సంరక్షణ కోసం ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేసి ప్రయోజనం పొందవచ్చన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ చేపట్టే నిబంధనతో పెద్దల ఆస్తిని తమ పేర్లపై బదలాయించుకుని తర్వాత దాన్ని ఉల్లంఘించినట్లయితే ఎల్డర్ లైన్ చట్టం ద్వారా సదరు ఆస్తిని తిరిగి తల్లిదండ్రులకు స్వాధీనం చేసే అవకాశం ఈ చట్టంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డర్ లైన్ ఫీల్డ్ రెస్పాన్స్ సిబ్బంది పాటిబండ్ల జాన్ బాబు, పిహెచ్‌సి సిహెచ్ఓ వెంకటేశులు, ఆరోగ్య సహాయకులు యలమందారెడ్డి, టంగుటూరు-1 ఎఎన్ఎం ఎస్.సౌమ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల సందర్శన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాల ప్రభుత్వ వైద్యశాలను ఎపి విపి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎన్.మూర్తి బుధ వారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో రోగులకి అందుతున్న సేవల గురించి, మందులు, గర్భిణులు, చిన్నపిల్లలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆక్సిజన్ ప్లాంట్లు, మందుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డుల్లో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాసరావు, గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మీ కళ్యాణి, డాక్టర్ వసంత కుమారి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ రసూల్, దంత వైద్యురాలు డాక్టర్ కళా సంధ్య, హెడ్ నర్స్ వెలిజబెత్, రాజశేఖర్ ఆరోగ్య మిత్రులు దర్శనం రాంబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



వైద్యశాలలో తనిఖీ చేస్తున్న అధికారులు

టిడిపి వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబే

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపి యర్రగొండపాలెం నియోజక వర్గ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబే నని కార్యకర్తలు ఈ విషయంలో ఎలాంటి అపోహలకు పోవద్దని టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ తెలిపారు. స్థానిక వినుకొండ రోడ్డులోని వైష్ణవి కళ్యాణ మండపంలో నియోజకవర్గ టిడిపి ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చెప్పిందే వేదమన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ యర్రగొండ పాలెం నియోజకవర్గంలో అభ్యర్థిని మార్చే ప్రశస్తే లేదన్నారు. టిడిపి అభ్యర్థి ఎరిక్షన్‌బాబే అని చెప్పారు. ఈనెల 21న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు యర్రగొండపాలెం పర్యాటనలో భాగంగా నిర్వహించే ప్రచార బేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యాక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బాయ్య, పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, చెవుల అంజయ్య, మంత్రూ నాయక్, ఆదినారాయణ, షేక్ చిన్నవలి, గురిజేపల్లి జిలాని, షేక్ ఇస్మాయిల్, తోటా మహేష్ నాయుడు, సేవ్యా నాయక్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగనన్న'

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని రెడ్డిచర్ల, బాదినేని పల్లె, సూరవారి పల్లె గ్రామ పంచాయతీల్లో వైసిపి గిద్దలూరు నియోజకవర్గ నాయకుడు కామూరి రమణా రెడ్డి అధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామూరి రమణారెడ్డి, ఎంపిపి కామూరి అమూల్య, గ్రామ సర్పంచులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం గృహ యజమానుల అనుమతితో గృహాలకు స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో సూరవారిపల్లి, రెడ్డి చర్ల, బాదినేనిపల్లి గ్రామ సర్పంచులు కాశమ్మ ఉమాదేవి జయరామి రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దారి చూపాలని తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి -శింగరాయకొండ

నూతనంగా నిర్మిస్తున్న మూడో రైల్వే లైన్ వల్ల ఆ గ్రామం దారి కోల్పోతుంది. తమకు దారి చూపాలంటూ ఊరు జనం కదిలారు. ఇది శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామ పంచాయతీలోనీ నర్రా వారి పాలెంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.... రైల్వే ట్రాక్ ప్రక్కనే రహదారి ఉంది. ఈ రహదారిలోనే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం మూడో రైల్వే లైన్ ఏర్పాటులో భాగంగా రహదారిని తొలగించారు. మూడో లైన్ ఏర్పాటు చేస్తే గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు దారి లేకుండా పోతుంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు తహశీల్దారు ఉషాను బుధవారం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో ఐదేళ్ల క్రితం ఉపాధి హామీ పథకం, గ్రామ పంచాయతీ నిధులతో తారు రోడ్డు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గ్రామస్తులు ఆ రహదారిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా ఈ రహదారిని తొలగించారు. రహదారి తొలగించడంతో తాము రాకపోకలు సాగిచేందుకు అవస్థలు పడాల్సి వస్తుందని తమకు రహదారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తహశీల్దారును కోరారు. స్పందించిన తహశీల్దారు శనివారం గ్రామానికి వచ్చి రహదారిని పరిశీలించి ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తహశీల్దారును కలిసిన వారిలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఐనాబత్తిన రాజేష్, జనసేన నాయకులు, గ్రామ పెద్దలు శీలం వెంకట రమణయ్య , ఈదుపల్లి శ్రీనివాస్, నున్న గణేష్, ఉసా మోహనరావు, నున్న సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో కొండ పాటి సిడులు సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో పోలేరమ్మ తిరునాళ్ల మంగళ వారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎడ్ల బండ్లు, పొట్టేలతో ప్రభలు ఏర్పాటు చేశారు. వైసిపి నాయకులు మద్దిసాని నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన ప్రభను వైసిపి రాష్ట్రకార్యదర్శి నలమలపు కష్ణారెడ్డి టెంకాయకొట్టి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.



తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభ

మాకినేని బసవపున్నయ్యకు నివాళి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య 31వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. సిపిఎం భట్టిప్రోలు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెం గ్రామంలో 1914 డిసెంబర్ 14న జన్మించిన ఆయన 1934లో కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా చేరి 1936లో జరిగిన జాతీయ విద్యార్థి సంఘ సంస్థాగత మహాసభలో జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారని అన్నారు. 1940 వరకు పనిచేసిన అనంతరం ప్రజాసేవ చేయాలనే తలంపుతో గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా, రాజ్యసభ పనిచేశారన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలిక తదనంతరం కూడా పొలిట్ బ్యూరో సభ్యునిగా పనిచేశారన్నారు. సిపిఎం అధికారిక పత్రిక పీపుల్స్ డెమొక్రసికి 14 ఏళ్ల సంపాదకునిగా పనిచేసిన ఘనత మాకినేనిదని కొనియాడారు. స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న ఆయన నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం, రైతు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి సుధాకర్, పి మనోజ్, జి నాగరాజు, ఏ శ్రీనివాసరావు, ఎం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



మాకినేని బసవపున్నయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పశువులకు ఉచితంగా ఎద ఇంజక్షన్లు

పంగులూరు పశు వైద్యుడు మురళీకృష్ణ

ప్రజాశక్తి-పంగులూరు

ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు పశువులకు ఉచితంగా ఎద ఇంజక్షన్లు ఇస్తున్నట్లు పంగులూరు పశువైద్యశాల వైద్యులు డాక్టర్ మెల్లెంపూడి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం పంగులూరులోని పశువైద్యశాలలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఇప్పటివరకు ఎద ఇంజక్షన్లను వేసినందుకు పశుపోషకుల నుంచి నామినల్ ఫీజు వసూలు చేసేవారు అని, అయితే ఈ నెల ఒకటో తేదీ నుంచి వచ్చే జూలై 31వ తేదీ వరకు, ఆ ఇంజక్షన్లను ఉచితంగా వేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఇది రాష్ట్ర మొత్తం అమల్లో ఉంటుందని చెప్పారు. గాలికుంటు నివారణా ఇంజక్షన్లు విస్తారంగా చేస్తున్నామని, తన పరిధిలో ప్రస్తుతం 2,320 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని, మరో వెయ్యి పశువులకు టీకాలు వేయాల్సి ఉందని చెప్పారు. రామకూరు పశు వైద్యశాల పరిధిలోని కొండ మంజులూరు, రామకూరు, బయట మంజులూరు, భగవాన్ రాజుపాలెం గ్రామాల్లో, 965 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని, పంగులూరు పశువైద్యశాల పరిధిలో ఉన్న పంగులూరు, ఆరికట్లవారిపాలెం, బూదవాడ, కళ్లంవారిపాలెం, చిన్నమల్లవరం, కోటపాడు, జనకవరం గ్రామాల్లో ఇప్పటివరకు 1,350 పశువులకు టీకాలు వేశామని, రేపటి నుంచి పంగులూరులో కూడా టీకాలు వేస్తామని చెప్పారు. పంగులూరు పూర్తయిన తర్వాత, ఈ 11 గ్రామాల్లో మరోసారి గ్రామాల్లో తిరిగి, మొదటిసారి వేయని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని చెప్పారు. పశుపోషకులు టీకాలు వేయించని పశువులను తమ సిబ్బందికి చెప్పి టీకాలు తప్పకుండా వేయించుకోవాలని కోరారు. గాలికుంటువలన పశువులు క్షీణించిపోతాయని, కొన్ని పశువులు చనిపోయే వరకు వస్తాయని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ప్రజలందరికీ తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని, అందువలన ప్రతి ఒక్కరూ తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు.



పంగులూరు పశువైద్యశాలలో పశువుకు ఎద ఇంజక్షన్ వేస్తున్న పశు వైద్యుడు

చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పంగులూరు

పసిపిల్లలకు క్రమం తప్పకుండా, సమయానికి టీకాలు వేయాలని, బాపట్ల జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని అలవలపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎండలకు పసిపిల్లలకు ఇబ్బంది లేకుండా వైద్య సిబ్బంది వారికి ఇవ్వాల్సిన టీకాలను సకాలంలో వేయాలన్నారు. గర్భిణులకు వేయాల్సిన రెండు టీకాలను కూడా సకాలంలో వేయాలని, రక్తహీనతను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని కోరారు. గర్భిణులు, బాలింతలు పుష్టికరమైన ఆహారం తీసుకోవడం ద్వారా, తమ ఆరోగ్యాలను కాపాడుకోవడంతో పాటు, బిడ్డల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని ఆయన చెప్పారు. అలవలపాడు గ్రామంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగుతున్న తీరును ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందిని అభినందించారు. సిబ్బందికి తగిన సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మల్లికార్జున్‌రావు, డాక్టర్ శివ చెన్నయ్య, సూపర్‌వైజర్ రమాదేవి, సిహెచ్‌ఓ భారతి, ఏఎన్ఎం శకుంతల, ఎంఎల్‌హెచ్ పీ మార్త, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అలవలపాడు ఆరోగ్య ఉప కేంద్రంలో పసిబిడ్డను పరీక్షిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వెంకటేశ్వర్లు

నిషేధ సమయంలో వేటకు వెళితే చర్యలు

మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సాయి సందీప్

ప్రజాశక్తి-రేపల్లె



సముద్రంపై వేట నిషేధ సమయంలో ఎవరైనా మత్స్య వేటకు వెళితే చట్టపరమైన చర్యలు ఎదుర్కొనక తప్పదని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పి సాయిసందీప్ చెప్పారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో వేటను నిషేధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిందని, తూర్పు బంగాళాఖాతం సముద్రంలో తీరప్రాంత మత్స్యకారులు ఎవరూ చేపల వేట చేయరాదని చెప్పారు. వేటకు వెళ్లిన వారిపై ఏపీ ఎంఎస్ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కాలంలో వేటచేయని మత్స్యకారులకు నిషేధకాల భృతిని మంజూరు చేసేందుకు ఫిష్ లాండింగ్ సెంటరు వారీగా వేట నిషేధకాల జాబితాను తయారు చేయడానికి ఏప్రిల్ 17వ తేదీన ఆయా పడవలను తనిఖీ చేసేందుకు తనిఖీ బృందం లాండింగ్ సెంటర్లకు వస్తాయన్నారు. మత్స్యకారులు తమ పడవలను తనిఖీ నిమిత్తం నిర్దేశించిన ఫిష్ లాండింగ్ సెంటర్లలో మాత్రమే అందుబాటులో ఉంచాలన్నారు. వేట నిషేధకాల భృతి పొందేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో లబ్ధిదారుడు కాని మత్స్యకారుడు మాత్రమే అర్హుడన్నారు. ఒక హౌస్ హెరీల్డ్ను ఒక కుటుంబంగా పరిగణిస్తామని, ఒక కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హులని అన్నారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.1.20 లక్షలలోపు ఆదాయం కలిగిన గ్రామీణులు, రూ.1.44 లక్షల లోపు ఆదాయం కలిగిన పట్టణ ప్రజలు అర్హులని చెప్పారు. కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా, ఇన్కమ్ టాక్స్ చెల్లిస్తున్నా వారు అనర్హులని చెప్పారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మండల తహశీల్దారు మల్లికార్జునరావు

ప్రజాశక్తి-రేపల్లె



ముందస్తు జాగ్రత్తలతో మండు వేసవిని అధిగమిద్దామని తహశీల్దారు డి మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "రానున్న రెండు నెలల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై ప్రతిఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని కోరారు. వడగాల్పులపై ప్రజలకు అవగాహన కల్పించి తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చలివేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. వేసవిలో అనవసరంగా ప్రజలు బయటకు రావద్దని అన్నారు. అత్యవసర పనులను ఉదయమే పూర్తి చేసుకోవాలని సూచించారు.

వడదెబ్బ తగలకుండా..

చెమట పట్టకపోవడం.. శరీర ఉష్ణోగ్రతలు పెరగడం.. వణుకు పుట్టడం.. ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితి రావడం వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో ఎక్కువగా ఎండలో తిరగద్దు. రోడ్ల వెంట విక్రయించే చల్లని రంగు పానీయాలు, కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలి. మద్యం, మాంసం తగ్గించాలి. నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు వాడడం, టోపీ ధరించడం మంచిది.

నిర్లక్ష్యం చేయవద్దు..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వీలైనంత త్వరగా చల్లని గాలి తగిలే ప్రదేశానికి చేర్చాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు ద్రావణం లేదా ఓఆర్ఎస్ తాగించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరింత జాగ్రత్త తీసుకోవాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తికి బీపీ హెచ్చుతగ్గుల వల్ల కార్డియాక్ అరెస్ట్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

16న ఉచిత కంటి శుక్లాల నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత కంటి శుక్లాల నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వేగేశన ఫౌండేషన్ చైర్మన్ వేగేశ్న నరేంద్రవర్మ బుధవారం విలేకరులకు తెలిపారు. బాపట్ల పట్టణంలో కోన ప్రభాకర్‌రావు టౌన్ హాల్ పక్కన వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శుక్లాల నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు శిబిరంలో కంటి శుక్లాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. బాపట్ల నియోజకవర్గం ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరేంద్రవర్మ కోరారు. నేత్ర పరీక్షల అనంతరం శుక్లాలు ఉన్నవారికి ఎన్ఆర్ఐ జనరల్ హాస్పిటల్‌కు తీసుకు వెళ్లి ఉచితంగా శుక్లం ఆపరేషన్ చేసి మందులు ఇస్తామని తెలిపారు. ప్రయాణ సౌకర్యం, భోజన సదుపాయం కూడా కల్పిస్తామని చెప్పారు. అయితే ఆరు వారాల తరువాత శుక్లాల ఆపరేషన్ చేసుకున్న వారికి పరీక్షలు చేసి అవసరమైతే ఉచిత కళ్లజోళ్లు అందజేస్తారని పేర్కొన్నారు. వృద్ధులు, కంటి సంబంధిత సమస్యలతో బాధపడేవారు ఈ ఉచిత కంటి శుక్లాల నిర్ధారణ శిబిరంలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరేంద్రవర్మ కోరారు.

18న మండల సమావేశం

ప్రజాశక్తి-రేపల్లె

మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న మధ్యాహ్నం 2.30 గంటలకు అధ్యక్షులు పెనుమాల సుశీల అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఓ కెఎస్ మల్లికార్జునరావు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష, ఇతర ఎజెండా అంశాలపై సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశానికి సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సిడిపిఓ

అనాథ పిల్లలకు ఆర్థిక రక్షణ 'మిషన్ వాత్సల్య'

ప్రజాశక్తి-పంగులూరు

18 సంవత్సరాల లోపు వయసు కలిగిన పిల్లలకు ఆర్థికంగా రక్షణ కల్పించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ వాత్సల్య పథకాన్ని నిర్వహిస్తుందని సిడిపిఓ కృష్ణకుమారి అన్నారు. అంగన్‌వాడీ సెంటర్ తనిఖీలో భాగంగా బుధవారం పంగులూరులోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరాధారణకు గురై, అవసరతలో ఉన్న బాల బాలికలకు విద్య, ఆరోగ్యం, అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడేలా ఆర్థికంగా ఆదుకోవటం మిషన్ వాత్సల్య పథక లక్ష్యం అని అన్నారు. అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయినవారు, తల్లిదండ్రుల దూరమైన వారు, పాక్షిక అనాథలు, విడాకులు తీసుకున్నవారు, కుటుంబాన్ని వదిలేసిన వారు, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధులతో ఉన్నవారు, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం 2015 ప్రకారం, కుటుంబ వాతావరణంలో పెరగటానికి ఒక్కొక్కరికి నాలుగు వేల రూపాయల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దీనికి అర్హులైన వారిని గ్రామమహిళా కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గుర్తించి పిల్లల వివరాలు కుటుంబ నేపథ్యం, ఆర్థిక, సామాజిక, ఆరోగ్య పరిస్థితులు, పిల్లల చదువు వివరాలను తెలియజేస్తూ దరఖాస్తులు పూర్తి చేసి, ధ్రువపత్రాలు జతపరిచి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ లోపు అందజేయాలని తెలియజేశారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఒకటో తేదీనే జీతాలివ్వాలి

కలెక్టరేట్ వద్ద అమరావతి జెఎసి నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని అమరావతి జెఎసి జిల్లా అధ్యక్షులు ఆర్‌వి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఎపి అమరావతి జెఎసి అధ్వర్యంలో ప్రకాశం జిల్లాలో ఉద్యోగుల సమస్యల సాధన కోసం నల్ల బాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని 11వ పిఆర్‌సి అరియర్స్ ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరించాలని, 12వ పే రివిజన్ కమిషన్‌ను నియమించాలన్నారు. చనిపోయిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలన్నారు. న్యాయమైన డిమాండ్లను సాధించుకునేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల నాయకులు విశ్వరూపాచారి, జయరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ నాయకులు అబ్దుల్లా, జిల్లా రెవెన్యూ సంఘ కోశాధికారి డానియల్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రభుత్వ డైవర్ల సంఘం అధ్యక్షుడు ప్రసన్న కుమార్, రెవెన్యూ కలెక్టరేట్ సంఘ అధ్యక్షులు ఊతకోలు శ్రీనివాసరావు, విఆర్‌ఏ సంఘం జిల్లా నాయకుడు ఎలీషా, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధాన్ని విధించాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మద్యపాన నిషేధాన్ని విధించాలని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాలు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు సూచన మేరకు బుధవారం స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ మద్యం షాపు వద్ద మద్యపాన నియంత్రణపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం సేవించడం వల్ల ప్రధాన ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. కల్తీ మద్యంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని, గత మూడున్నరేళ్ల లో డ్రగ్స్ నేరాలకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మారిందన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో పాటు మహిళలపై నేరాలు, అఘాయిత్యాలు క్రమంగా పెరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి నేరాల నియంత్రణకు బదులుగా ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు రావుల పద్మజ, కొఠారి నాగేశ్వరావు, కె.కుసుమ కుమారి,పెద్దిశెట్టి వరలక్ష్మి, టి.అనంతమ్మ, ఉప్పలపాటి నాగేంద్రమ్మ, మండవ లావణ్య, గంగవరపు పద్మ, కేసన శేషమ్మ, చుండి శ్యామ్, బీరం అరుణారెడ్డి, బోను దుర్గ, మల్లీశ్వరి, బండారు మదన్ పాల్గొన్నారు.

నిర్బంధాల నడుమ సిఎం పర్యటన

ప్రజాశక్తి-మార్కాపురం


సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నిర్బంధాల నడుమ సాగింది. బుధవారం మార్కాపురం విచ్చేసిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ప్రాంత సమస్యలు విన్నవించేందుకు అవకాశం లేకుండా పోయింది. సిపిఎం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, డి.సోమయ్య, డికెఎం రఫి, పి.రూబెన్‌లతో పాటు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, సిపిఐ నాయకులను ముందుగానే గృహ నిర్బంధాల్లో ఉంచారు. ఈ ప్రాంత సమస్యలపై ఒక్కొక్కరుగా అర్జీలు అందిస్తామన్నా అంగీకరించలేదు. సిఎం జగన్ రోడ్డు మార్గాన ఎస్‌వికెపి కళాశాలకు కాన్వాయ్‌లో వెళుతున్న సందర్భంగా పలువురు వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా అంశాన్ని సిఎం జగన్ వద్దకు చేర్చాలని ప్రయత్నించిన ఆందోళనకారులు, ప్రజా సంఘాల నేతలు విఫలమయ్యారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిఎం జగన్ పర్యటన ముగించుకుని తిరిగి వెళ్లేంత వరకు పోలీసుల అదుపులో ఉండాల్సి వచ్చింది.

'బాలినేని' కారును అడ్డుకున్న పోలీసులు

- పోలీసుల తీరుపై ఒంగోలు ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం
- సిఎం పర్యటనలో పాల్గొనకుండా వెనుదిరిగిన వైనం
- అంతా ఉత్కంఠ..
- మంత్రి సురేష్‌తో సిఎం జగన్ భేటీ
- సిఎంఒ జోక్యంతో ఆఖరులో వేదికపైకి వచ్చిన మాజీ మంత్రి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, మార్కాపురం

హెలిప్యాడ్ వద్దకు వెళుతున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కారును పోలీసులు అడ్డుకున్నారు. కారు దిగి నడిచి వెళ్లాలని చెప్పారు. దీంతో బాలినేని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నా కారునే అనుమతించరా? అంటూ తీవ్ర అసహనం చెందారు. అప్పటికీ పోలీసులు తమ నిర్ణయాన్ని మార్చుకోలేదు. దీంతో అవమానంగా భావించిన బాలినేని అక్కడ నుంచి వెనుదిరిగారు. చీమకుర్తి వరకూ వచ్చేశారు. హెలిప్యాడ్ వద్ద ఉన్న మంత్రి ఆదిమూలపు సురేష్‌కు విషయం తెలిసి..



బాలినేనితో బటన్ నొక్కిస్తున్న సిఎం జగన్

వెంటనే వచ్చి బాలినేని తీసుకుపోయే యత్నం చేసినా ఫలించలేదు. సిఎం హెలికాప్టర్ దిగారు. ఆయన్ను జిల్లా ఎమ్మెల్యేలు అందరూ కలిశారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చారు. అక్కడ నుంచి బయలుదేరి వేదిక వద్దకు వచ్చారు. బాలినేని లేని విషయం సిఎం జగన్ కూడా ఆరాతీసి తెలుసుకున్నారు. వేదిక పక్కనే ఉన్న గదిలో మంత్రి ఆదిమూలపు సురేష్‌తో సిఎం జగన్ కాసేపు భేటీ అయ్యారు. ఏం జరిగిందో తెలుసుకున్నారు. ఈ లోగా వేదికపైకి వచ్చిన ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ కనిపించింది. బాలినేని మనస్తాపంతో వెళ్లారనేది పెద్ద చర్చగా మారింది. మీడియాలో న్యూస్ రావడంతో దుమారం రేగింది. వెంటనే సిఎం ఆదేశాలతో సిఎంఒ కార్యాలయం స్పందించింది. వెంటనే బాలినేనితో ఫోనులో సంప్రదించారు. అప్పటికే ఆయన చీమకుర్తి వరకూ చేరారు. జిల్లా ఎస్పీ కూడా చాలా సార్లు బాలినేనికి ఫోను చేసినా ఆయన ఎత్తలేదు. సిఎంఒ అధికారులు గట్టిగా బతిమిలాడారు. జరిగిన సంఘటనపై విచారణ జరుపుతామని సూచించారు. మీరు తిరిగి వెళ్లాలని సిఎం చెప్పారని సూచించారు. దీంతో బాలినేని మళ్లీ మార్కాపురం వచ్చారు. సిఎం ప్రసంగం ముగిసే సమయంలో వేదికపైకి వచ్చారు. మంత్రి ఆదిమూలపు సురేష్ ఆయన్ను తీసుకుని వేదికపైకి వచ్చారు. అప్పుడే ప్రసంగం ముగించిన సిఎం జగన్ తన పక్కనే ఉన్న బాలినేని చేయి పట్టుకొని ల్యాప్‌టాప్‌లో 'ఇబిసి నేస్తం' పథకానికి సంబంధించి బటన్ నొక్కించారు. దీంతో కథ సుఖాంతం అయిందని నేతలు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా అధికారుల సమన్వయ లోపంతోనే ఈ ప్రోటోకాల్ రగడ జరిగిందని తెలుస్తోంది. హెలిప్యాడ్ వద్దకు వెళ్లే వ్యక్తులు, కార్లు, వారి బాధ్యతలపైనా స్పష్టత ఉండటం లేదు. సాదాసీదా వ్యక్తులు కూడా వెళ్లి బోకేలు ఇస్తుంటారు. ప్రోటోకాల్ ఉన్న మాజీ మంత్రి, పార్టీ కో ఆర్డినేటర్‌ను ఎందుకు ఆపారనే చర్చ ఆ పార్టీ నేతల్లోనూ ఉత్కంఠగా మారింది. పోలీసుల ఓవర్‌యాక్షన్ వల్లనే ఇలాంటివి తలెత్తుతున్నాయి. ప్రజల విషయంలోనూ ఇదే చేస్తున్నారు. సిఎం ఎక్కడకు వెళ్లినా దుకాణాలు మూయించడం, రాకపోకలపై నిషేధాలు పెట్టడం, జనంపై దురుసుగా ప్రవర్తించడం వంటివి చేస్తున్నారు. నేతలు తమకు జరిగినప్పుడే కాకుండా జనం ఇబ్బందులు కూడా గమనించాలి.

'ప్రచార భేరి'ని జయప్రదం చేయాలి

- మోడీని గద్దె దించాలి
- మతోన్మాద విధానాలపై పోరాడాలి
- వామపక్షాల ప్రచార భేరీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14 నుండి 30 వరకు వామపక్షాలు చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీల నేతలు కోరారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో బుధవారం కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. సిపిఎం నాయకులు దామా శ్రీనివాసులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు, కడప ఉక్కు ఫ్యాక్టరీకి, రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. 32 మంది బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కులు ప్రైవేటు వ్యక్తులకు అమ్మేందుకు ప్రయత్నించటం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ముడి సరుకు గనులు కేటాయించడం చేతకాని కేంద్ర ప్రభుత్వానికి ఫ్యాక్టరీని అమ్మే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిర్వహిస్తున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈనెల 14న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ప్రారంభ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ నాయకులు పివిఆర్ చౌదరి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుందని, దేశంలోని 55 శాతం సంపద కేవలం 10 శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తుల వద్ద పోగైందన్నారు. మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ వ్యక్తులకు కారుచౌకగా అమ్మి ఈపాటికి నౌకాశ్రయాలు, విమానాశ్రయాలతో పాటుగా సముద్ర తీరాన్ని అదానికి దోచి పెట్టారన్నారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టు ను పూర్తిస్థాయిలో నిర్మించేందుకు రెండు వేల కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చి అభివద్ధికి నిధులు కేటాయించాలని, కనిగిరి ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు చేపట్టిన నిమ్జ్, దొనకొండ ప్రాంతంలో పారిశ్రామిక వాడ, జిల్లాలో విమానాశ్రయం, జిల్లాలో పేపర్ మిల్లును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్‌డి సర్దార్, కొత్తకోట వెంకటేశ్వర్లు, కల్లూరి లక్ష్మయ్య, పాటిబండ్ల సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఉగ్ర

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి : ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. కనిగిరి పొగాకు వేలం కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉగ్ర సరసింహారెడ్డి రైతులతో మాట్లాడారు. అనంతరం బయ్యర్లు,అధికారుతో మాట్లాడి పొగాకు ధర గురించి చర్చించారు. అకాల వర్షాలు, వాతావరణం అనుకూలించక పంటలు దెబ్బ తినటంతో రైతులు నష్ట పోయినట్లు తెలిపారు. పండిన పంటకు కనీసం గిట్టు బాటుధర కల్పించి రైతులు వ్యవసాయానికి దూరం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, వివిధగ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

మద్దిపాడు: మండల పరిధిలోని వెల్లంపల్లి పొగాకు కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను రీజినల్ మేనేజర్ ఎం. లక్ష్మణరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా బోర్డు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలం కేంద్రం నిర్వహణధికారి సత్య శ్రీనివాసరావు, బోర్డు సభ్యులు బోడపాటి బ్రహ్మయ్య, పొద వర ప్రసాద్, సుబ్బారెడ్డి, ఐటిసి లీఫ్ మేనేజర్ శివ కుమార్. రైతు నాయకులు శేషగిరి రావు, రావి ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

సిఎం పర్యటనలో పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

సిఎం పర్యటన పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ మలికగర్గ్ తెలిపారు. రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురంలోని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈబీసీ నేస్తం రెండవ విడత పథకాన్ని ప్రారంభించారు. ప్రసంగం అనంతరం తిరిగి బయలు దేరారు. ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా



బందోబస్తు ఏర్పాట్లలో ఎస్పి మల్లికగర్గ్

ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ముఖ్య మంత్రి పర్యటన ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకొని ప్రజలకు గానీ, ట్రాఫిక్‌కు గానీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఒక పటిష్టమైన బందోబస్త్ విజయవంతంగా నిర్వహించడ మైందన్నారు. పోలీస్ శాఖతోపాటు ఇతర శాఖల సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమైందని, సహకరించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు.